

కవులు, కథకులు వాల్మీకి రామాయణాన్ని, వ్యాస భారతాన్ని చదివి తీరాలి.
కచ్ఛప సీతలోని ఊర్మిళ కథ రామాయణంలో లేదు. ఊర్మిళ నిద్ర
అనేది జానపద కథ. తన దు:ఖాన్ని నిభాయించుకునే శక్తి
తనలోనే ఉందని తెలుసుకోవడమే నాయీ కల్పన ఉద్దేశం.
కచ్ఛపం (తాబేలు) ప్రతీక.

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

# 4
# కచ్ఛప సీత





భూమివలె నిట్టూర్చింది సీత. ఊర్మిళను మరింత దగ్గరకు తీసుకుందామె.

ఊర్మిళ కన్నీరు సీత భుజం మీదికి ధార కడుతోంది. ఆమె వీపు నిమురుతూ అంది సీత.

''ఊరుకో... నీ కన్నీళ్లు సౌమిత్రి కళ్లల్లో తిరుగుతున్నాయి.''

అతని పేరు వినగానే ఊర్మిళ సీతను ప్రాణంతో కావులించుకుంది. ''అక్కా,'' అనగలిగిందామె. ఊర్మిళ బాష్పహృదయం నిండుకున్న తరువాత మృదువుగా ఆమెని విడిపించుకుని, చేతితో కన్నీటి చారికల్ని తుడుస్తూ అంది సీత.

''నువ్వు నీ తండ్రి దగ్గరకి వెళ్లు. అక్కడ కొన్నాళ్లు సరోవరాల్లో చేపలా ఈదులాడు. ఉద్యానాల్లో పక్షిలా విహరించు. పచ్చనిచెట్ల నీడల్లో పడుకుని నీ బాల్యంలోకి వెళ్లు. మన సుఖసంతోషాలని అక్కడే విడిచి వచ్చేం.''

''సరోవరాల్లో లక్ష్మణుడితో ఈదులాడేను. తోటల్లో అతనితో విహరించేను. ఇద్దరం నా బాల్య కౌమారాల్లోకి వెళ్లి వచ్చేం. అతను నాతో లేనిదెప్పుడు! అతను నా నీడ.''

''ఊర్మిళా, అతనప్పుడు నీతో ఉన్నాడు. ఇప్పుడు నీతో ఉంటాడు. అంతే. ఆ తేడా గుర్తించు. బెంగపడకు. నేనున్నాను. నా మాట నమ్ము.''

సీత రెండుచేతులూ పట్టుకుని, ''అక్కా సౌమిత్రిని ఒక్కసారి చూడాలని ఉంది,'' అంది ఊర్మిళ.

''ఇప్పుడే కదా నిన్ను వదిలి వెళ్లేడు. అతను నీ కళ్లలో పడితే వలలో పడ్డ చేపలా నీ ఒళ్లో పడతాడు. చూడు ఇక్కణ్నించి. నీల మేఘానికి మెరుపు అంచులా అడుగో... చూడు, నీ ధర్మం అతగాడి ధర్మాన్ని నిర్వర్తించడంలో ఉంటుంది.''

మెట్ల మీద నుంచుని చూస్తూంటే ప్రాంగణం లోపలా వెలుపలా జనంతో, రాజబంధువులతో నిండిపోయి ఉంది. మహిళల బుగ్గల మీదుగా ఆగని కన్నీటిధారల్ని తుడుచుకోవడానికి ఎవరూ ప్రయత్నించడంలేదు. అయోధ్యనగరం మీద ఒక కన్నీటిమబ్బు దట్టంగా కమ్ముకుంది. చివరిసారిగా సీత ఆమెని దగ్గరికి తీసుకుని మెట్లు దిగి వెళ్లిపోయింది. ఊర్మిళ రెండు చేతులూ కలిపి నమస్కరిస్తూ ఉండిపోయింది. అలా చూస్తుండగానే చటుక్కున ఉచ్చైస్వరంతో, దీర్ఘప్రయాణం సుఖ

వంతం కావడానికీ, యోగక్షేమాలు చేకూరాలనీ పురోహితుల మంత్రస్వర మేళ అందు కుంది. ఊర్మిళ నీళ్లు నిండిన కళ్లకు అంతా అస్పష్టంగా ఉంది. ప్రాంగణం అంతా ఉదయపు బంగారు ఎండ పరుచుకున్నా ఆమెకు అసుర సంధ్యలా ఉంది. అన్న దమ్ములు, సీత, పరివారజనం నగర ప్రజలలో కలిసిపోయారు. తలపాగల మధ్య వాళ్లు కనిపించడంలేదు. వేర్లు సడలి ఒదిగిపోయిన చెట్టులా ఊర్మిళ కళ్లు తిరిగి పరిచారికల భుజం మీద వాలిపోయింది. అన్నదమ్ముల్ని కడుపారా చూసుకుని స్త్రీ జనం ప్రాంగణంలో స్తబ్దుగా నిలబడిపోయారు.

ఆ ఉదయం మొదలుగా పదిదినాలు ఊర్మిళ స్తబ్దుగా చూపులేని అనిమేషలా, వర్షంలో పూలచెట్టులా ఉండిపోయింది. అన్నం, పండ్లు, మద్యం ఏవీ ఆమెకి రుచించడం లేదు. పక్షం దినాలకి ఆమె ఆకులు దూసిన పూలతీగ అయిపోయింది. అతని రూపం, కంఠస్వరం, చూపులు, దేహస్పర్శ ఊర్మిళను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక నోరు తెరిచి ఆమె మాట్లాడి చాలా దినాలయిపోయింది. ఒక అడవి గాలి ప్రవేశించి నవ్వుల్నీ, ఆహ్లాదాన్నీ, ఆటపాటల్నీ ఎత్తుకుపోయినట్టయింది. ఆమె పరిచారికలకు సూర్యోదయం కావడం భయంగా ఉంది.

ఊర్మిళ వియోగదినాలు గ్రీష్మ తీవ్రతతో ఆమెను చుట్టుముట్టేయి. సీత మాటలు జ్ఞాపకం చేసుకుందామె. సౌమిత్రి సంచరించి, తనతో క్రీడించిన ఈ స్థలంలో తను ఉండలేదు. ఆ రాత్రి ఆమె ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. తన ఇంటి నుంచి తెచ్చుకున్న ముగ్గురు పరిచారికలను ఉదయమే పిలిచి ప్రయాణానికి సిద్ధం చెయ్యమని చెప్పిందామె. మొదట ఆశ్చర్యం అనిపించినా స్వస్థలానికి వెళ్లడం వాళ్లని ఉత్సాహపరిచింది.

భోజనానంతర విశ్రాంతి సమయం దాటిన తరువాత ఊర్మిళ అత్తమామల భవనానికి వెళ్లి అనుమతి తీసుకుంది. సుమిత్ర ఆమెని దగ్గరికి తీసుకుని ఓదారుస్తూ కంటనీరు పెట్టుకుంది.

ముహూర్తం చూసి ఊర్మిళనీ, పరిచారికలనీ, సాయుధులైన విలుకాళ్లనీ తోడిచ్చి పుట్టింటికి పంపించారు. ఆమెని చూడగానే తల్లిదండ్రులకి కన్నీరు ఆగలేదు. పుట్టింటికి చేరిన కొన్ని దినాల వరకూ ఆమె చెలికత్తెలతో, పరిచారికలతో మాట్లాడ్డంతో సరిపోయింది. నిద్ర సమయంలో తప్ప ఆమెకి ఏకాంతం లేకుండాపోయింది. అయోధ్య సంగతులు చెప్పి చెప్పి అలసిపోయిందామె. మరికొన్ని దినాలకి పుట్టిల్లు అలవాటయిపోయింది. ఒంటరితనం కమ్ముకుందామెను. అయోధ్యలో సౌమిత్రి వస్త్రాలు, ఇతర వస్తువులు, అతను ఆడిన పాచికలు, వాటిని తాకినప్పుడల్లా అతని స్పర్శ కలిగేది. శయ్య సగభాగం అతని దేహగంధంతో వెచ్చదనంతో సామీప్యాన్ని తలపించేది. సర్వం సౌమిత్రిమయం అక్కడ. ఇక్కడ ఆమెకి అటువంటి ఆత్మీయమైన అనుభవం కలిగించేవేమీ లేవు. ఒక్క వస్తువు కూడా సౌమిత్రిని జ్ఞాపకం చెయ్యడం లేదు. అది మరీ కంటకప్రాయంగా ఉందామెకి. ఎక్కడికో దూరంగా వెళ్లిపోవాలని

పించిందామెకి. ఒకరాత్రి, వేకువ జామునే లేచి ఒంటిగా లక్ష్మణుడి కోసం అడవులకి వెళ్ళిపోవాలనిపించింది.

ఊర్మిళ ఊహించినట్టు జరగడంలేదు. ఇక్కడ ఎటువంటి సాంత్వనా లభించడం లేదు. ఇంటికి చేరిన కొద్దిదినాలకే ఆమె ముగ్గురు పరిచారికలకీ ప్రియులు దొరికేరు. వాళ్ళ గురించి అడిగింది ఊర్మిళ. వాళ్ళ మాటలు వింటుంటే ఆమె శరీరం దహించుకుపోయింది. నిద్రపట్టలేదామెకి. తల్లిదండ్రులామె మానసిక, శారీరక స్థితిని గమనించకపోలేదు. ఒకసారి ఆయన పిలిపించి అన్నాడు.

"తల్లీ, దుఃఖాన్ని లేదనుకోవడం అజ్ఞానం. దాన్ని విస్మరించమని చెప్పడం అమాయకత్వం. ఈ విషయంలో దుఃఖం, సంతోషం ఒకటే. విస్మరించడానికి తిరస్కరించడానికి వీలులేనివి. నీ వేదన మా ఇద్దరినీ వడగాలివలె కమ్ముకుంటోంది. ధైర్యంగా ఉండు తల్లీ. నువ్వు ముందు నీ దుఃఖాన్ని అర్థం చేసుకో. బాధపడ్డం సహజం. కానీ దాన్ని క్షీరనీర న్యాయంగా అర్థంచేసుకునే ప్రయత్నం చెయ్యి. ప్రశ్నించుకో. తర్కించుకో. అమ్మా, నువ్వు ఏ ఉపశమనం కోరుకుంటున్నావో అది వెలుపల ఉండదు. నీలోనే, నీ అధీనంలోనే ఉంటుంది."

ఆమె నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది. లేచి వెడుతూ ఆమెని దగ్గరికి తీసుకుని అన్నాడాయన.

"అమ్మా మబ్బు కొండని దాచినట్టుగా దుఃఖం, ఆగ్రహం విజ్ఞతని దాస్తుంటాయి."

చెలికత్తెలు తోటల్లో విహారానికి సిద్ధం చేశారు. అవన్నీ తను వివాహానికి ముందూ తరువాతా తిరిగిన తోటలు. పచ్చి పరిమళంతో, రకరకాల పక్షుల కూతలు తిరిగి అప్పచెబుతూ, బెదిరి పారిపోతున్న లేడిపిల్లని పట్టుకుంటూ చాలాసేపు అందరూ విహరించిన తరువాత విశాలమైన సరస్తీరంలో సేదతీరుతూ వాలిపోయారందరూ. ఊర్మిళ పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. సౌమిత్రీ, తనూ సంచరించి స్నానించిన విశేషాల్ని గుర్తుచేసుకుందామె. ఒక పెద్ద కన్నీటి కెరటం ఆమెని ముంచెత్తి వెళ్ళిపోయింది. పరిచారికలు ఆమెని బలవంతంగా నీళ్లలోకి దింపగలిగారు. నులివెచ్చగా వున్నాయి నీళ్లు. అప్రయత్నంగా ఆమె చేప అయి నీటిలోకి వెళ్ళిపోయింది. ఈ సరస్సులోనే తనూ లక్ష్మణుడూ నావలో వచ్చి స్నానం చేశారు. ఎంతసేపు ఒకర్ని ఒకరు తరుముకుంటూ, దాటుకుంటూ, ములక లేస్తూ, కేరింతలతో సరస్సుని చిలికి వదిలి పెట్టారు. ఆ సంతోషం, ఆనందం ఇంత దుఃఖాన్ని ఎందుకు కలిగిస్తున్నాయి? ధనుర్బాణాలతో తనతో పక్షుల్నీ, చిన్న జంతువుల్నీ వేటాడ్డం, మరుగున దాక్కోవడం నేర్పించాడు గదా. అవన్నీ ఏవో గతజన్మ జ్ఞాపకాలు. ఇప్పుడీ శూన్యంలో, నిర్వేదంలో, ఒంటరిగా తనకి ఏ జీవితం మిగిలింది? సౌమిత్రి వెళ్ళగానే తనెందుకు మరణించలేదు? సంతోషానికీ, దుఃఖానికీ, మరణానికీ భేదం ఏముంది? ఒకదానివల్ల మరొకటి, ఒకదాని వెంట మరొకటి.

ఇది కల్పించే దుర్భరమైన వేదన భరించి జీవించే స్థైర్యం ఎలా కలుగుతుంది?

చటుక్కున ఆమె నీటి కిందికి ఈదుకుంటూ వెళ్లింది. అంతా స్పష్టాస్పష్టం. మళ్లీ పైకి తేలింది ఊర్మిళ. తన చుట్టూరా కొంచెం దూరంగా ఈదుకుంటూ ఆడుతున్నారు. ఒడ్డుకి చేరిందామె. పచ్చికలో పడుకుని శూన్యాకాశాన్ని చూస్తుండిపోయింది. సూర్యుడు లేని ఆకాశం నీలంగా బెంగటిల్లిపోతోంది అనుకుందామె. ఈ సృష్టిలో నిజానికి ఒంటరిగా లేనిదేముంది? చంద్రుడు, సూర్యుడు, చెట్లు, మనుషులూ అందరూ ఒంటరులే. ఈ తోటల్లో సౌమిత్రి ఒంటరి జింకల్ని బాణంతో కూల్చలేదా? ఆమె గుండె ఝల్లుమంది. ఆ పక్షులు, జింకల జతలు తనని శపించాయా? ఊర్మిళ శరీరం కంపించింది. తనెంత పాపం మూట కట్టుకుందో. ఆమె కళ్లు సెలయేళ్లయినాయి.

లక్ష్మణుడు నిశ్శబ్దంగా అనుసరిస్తున్న దుప్పి ముక్కుపుటాలెగరేస్తూ ఆగి చుట్టూరా చూసింది. లిప్తపాటులో అతను చెట్టు వెనక దాగి కూచున్నాడు. మెల్లిగా తల ఊపుకుంటూ రెండడుగులు వేసింది దుప్పి. రెండు అంగల్లో బయటికి వచ్చి బాణం గురిపెట్టాడు లక్ష్మణుడు. హఠాత్తుగా దుప్పి వెనక్కి తిరిగి శరవేగంతో ఒచ్చి అతని పొట్టలో కుమ్మింది. వెల్లకిలా పడిపోయాడు లక్ష్మణుడు. కడుపు పట్టుకుని మూలుగుతున్నాడతను. కెవ్వున అరిచి లేచి కూచుంది ఊర్మిళ. ఆమె కుదుటబడ్డానికి కొంత సమయం పట్టింది. తోటగాలికీ, భయానికీ ఆమె ఒంటి తడారిపోయింది.

రాత్రి ఆమె కళ్లనిండా కలలు. కలల నిండా లక్ష్మణుడు. అతని ఒళ్లో తల పెట్టుకుని నిద్రపోయిందామె. భారంగా ఉదయం కళ్లు విప్పి చూసేసరికి పరిచారిక నవ్వు ముఖం కనిపించింది. నీరసపడి శుష్కించిపోయింది ఊర్మిళ. నీళ్లులేని పూల చెట్టులా వాడిపోయింది. బలవంతంగా తల్లి అన్నం కలిపి చిన్నపిల్లలకి తినిపించినట్టు తినిపించవలసి వస్తోంది.

ఒక దినం సాయంకాలం ఊర్మిళ పాచికలను ముందు పెట్టుకుని చూస్తూ కూచుంది. ఇద్దరి ఆట ఒకరే ఎలా ఆడతారు? ఇంతలో ఆమె పరిచారికలిద్దరూ పెద్దగా నవ్వుకుంటూ వచ్చేరు.

‘‘అమ్మా, మీకోసం ఏం తెచ్చేమో చూస్తారా?’’

‘‘చూపించు.’’

ఒకామె చేతిలో తీగలల్లిన బుట్ట ఉంది. ఇద్దరూ చెవి నుంచి చెవి వరకూ నవ్వుతూ బుట్టని పక్కకి వాల్చి నేలమీద పడుకోబెట్టేరు. బుట్టలో ఏదో కదలిక మొదలైంది. మెల్లిగా బుట్ట అంచు నుంచి నేల మీదికి చిన్న తలకాయ బయటపడింది. క్షణంలో మూసిన చిప్పలాంటి శరీరంతో బయటపడింది. చల్లటి నేల తగిలి ఆశ్చర్యంతో అది ఒకసారి తలయెత్తి వీపుమీద చిప్ప మోసుకుంటూ కదిలింది. నలుపు వీపు మీద తెల్లటి చుక్కలు. ఊర్మిళ ఆశ్చర్యంతో కాస్త పెద్ద అరచెయ్యి అంత తాబేలుని చూస్తుండగా వాళ్లిద్దరూ చప్పట్లు కొట్టి అరిచేరు. చటుక్కున తాబేలు తల లోపలికి లాక్కుని ఆగిపోయింది. మళ్లీ తల బయట పెట్టి సంచారం మొదలు పెట్టిందది. విశాలమైన నేలమీద అటూ ఇటూ తిరుగుతూ, ఆగుతూ, మధ్యలో తనలోకి తను దూరిపోతూ మెల్లిగా ఊర్మిళను సమీపించి ఆగిపోయింది. ఆమె చెయ్యి చాపి

వీపు నిమిరింది. కాసేపు వీపు నిమిరించుకుని సందేహిస్తూ తల బయటపెట్టింది తాబేలు. చూపుడువేలు దాని తల మీద పెట్టగానే వెంటనే లోపలికి వెళ్లిపోయింది.

''అమ్మా, వేలు కరుస్తుంది. భద్రం.''

ఊర్మిళ ఆమె మాటలు వినలేదు. తాబేలు వేపే తదేకంగా చూస్తోందామె. తనలో తను ముడుచుకున్న ఆ చిన్న ప్రాణికీ, తనకీ ఏదో సంబంధం ఉంది. కాసేపటికి మళ్లీ అది ఊర్మిళవేపు నడిచి వచ్చింది. మెల్లిగా చెయ్యి చాపిందామె. ఆమెను చూసి ఆగిపోయింది తాబేలు. వాళ్లిద్దరూ చప్పట్లు కొట్టినా నిర్భయంగా ఊర్మిళను చూస్తోం దది. బాగా చీకటిపడ్డ తరువాత కూడా దీపాల వెలుగులో అది ఆమె సమీపంలోనే తిరుగుతోంది. తాబేలుని ఎత్తి ఎలా పట్టుకోవాలో నేర్చుకుంది ఊర్మిళ. చేతుల్లోకి తీసుకోగానే చెలి అడిగింది.

''దీనికి ఏం పేరు పెడతారమ్మా?''

ఊర్మిళ ఎక్కువసేపు ఆలోచించలేదు. ''సీత.''

వెంటనే మిగతా ఇద్దరూ దాన్ని పేరు పెట్టి పిలిచేరు. రాత్రి సీతని ఊర్మిళ శయ్య దగ్గరే బుట్టలో పెట్టి వెళ్లేరు వాళ్లు. నిద్రపోయే ముందు ఊర్మిళ ఒంగి పిలిచింది. ''సీతా.''

బుట్టలో ఏదో కదలిక గమనించిందామె. చిరునవ్వుతో నిద్రపోయిందామె. కలలో చిన్న సీత ఆమెతో ఏదో మాట్లాడింది. తెలవారుతూండగా అక్క సీత నవ్వుతూ కనిపించింది. నిద్ర లేవగానే ముందు ఊర్మిళ బుట్టవేపు చూసింది. పక్కకి ఒరిగి పోయింది. 'సీతా సీతా' అంటూ వెదకడం మొదలుపెట్టిందామె. సీత బయట గుమ్మం పక్కనే నిద్రలో ఉంది. ఊపిరి పీల్చుకుని దాన్ని ఎత్తుకుందామె. ఉదయం ప్రశాంతంగా అనిపించిందామెకి.

పరిచారికలందరికీ ఆశ్చర్యంగా ఉంది. సీతా అని పిలవగానే తల బయట పెట్టి చూస్తోంది తాబేలు. కానీ ఊర్మిళ పిలిస్తేనే వస్తోంది. ఆశ్చర్యంగా ఆనందంగా ఉంది ఊర్మిళకి.

రాత్రి పడుకునే వరకూ సీత ఆమె సాన్నిధ్యంలో, ఆమె వెంట తిరుగుతోంది. దాన్ని పేరు పెట్టి పిలవడం ఊర్మిళకి ఇష్టమైన అలవాటుగా మారింది. తోటలో అటూ ఇటూ తిరుగుతూ ఏ చిన్న ప్రమాదం అనిపించినా తనలోకి దూరిపోతోంది సీత. ఈ రక్షణ ఊర్మిళకి అద్భుతంగా అనిపించింది. ఈ చిన్న సీత ఏదో గొప్ప రహస్యం దాచు కుంది. అప్పుడప్పుడది ఇద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు తల ఎత్తి తనకి చెప్పాలను కుంటున్నది. తన ఉనికి, చైతన్యం సీత సహజంగా కాపాడుకుంటోంది. దేహాన్ని తన చెక్క గూడులో దాచుకుంటూ ఒక స్పృహనేదో తనలోనే దాచుకుంటోంది. లోకంలో ఉంటూ, తిరుగుతూ, తింటూనే తన లోకంలో తనదైన ప్రత్యేకమైన నిద్ర, జాగ్రద వస్థల్లో జీవిస్తోంది సీత. ఇది కాలాన్నీ చైతన్యాన్ని తన అధీనంలో ఉంచుకుంటోంది గదా అనుకుంది ఊర్మిళ. హఠాత్తుగా ఈ ఆలోచన ఆమె వెన్నుపూసలో జలదరించింది.

''కాలక్షేపానికి పరిచారికలు చెలులు ఉన్నారు. ఆనందించడానికి కావాలంటే చిలుకలనో గొరవంకలనో తెప్పించేదాన్ని కదా! మట్టి ముద్దలాంటి ఈ తాబేలు ఎలా నచ్చింది మీ కుమార్తెకి?'' అన్నది ఊర్మిళ తల్లి.

కాసేపు ఆయన ఏమీ అనలేదు. చివరకి సాలోచనగా, "అమ్మాయి చిన్నసీతతో ఆడుకోవడం చూశాను. వాస్తవానికి ఆమె ఆడుకోవడంలేదు. కారణం చెప్పలేనుగానీ ఊర్మిళ దానివల్ల ఏదో ఆలోచనలో పడిందనుకుంటున్నాను," అన్నాడాయన.

"అది ఎలా సాధ్యం!"

"ప్రకృతి మన గురువని అంగీకరిస్తే అది సాధ్యమే. ప్రాణికోటి ప్రకృతిలో భాగమే కదా. సీత కూడా ప్రకృతి అవుతుంది అప్పుడు. మన అంతరాంతరాలు ప్రకృతికి స్పందిస్తాయి. వాటిని గమనించడం మన చిత్తసంస్కారాన్ని బట్టి ఉంటుంది. బుద్ధిని బట్టి అర్థం చేసుకోవడం ఉంటుంది. ఈ రెంటికీ అతీతమైన ఒక స్ఫురణ కూడా ఉంటుంది."

పగలంతా ఊర్మిళ సీతను చూస్తూ ఆడుకుంటూ తనకి తెలీకుండానే సంతోషపడుతోంది. పరిచారికల మాటలు పాటల కంటే సీతతో గడపడం ఆమెకి ఎక్కువ ఇష్టంగా ఉంటోంది. రాత్రి గడపడం మాత్రం కష్టంగా ఉంది. ఒకసారి నిద్ర పోవడానికి ప్రయత్నిస్తుండగా ఆమెకి అనుమానం వచ్చింది. సీతకి కలలు వస్తాయా? ఎటువంటి కలలు వస్తాయి? తనలో తను ఇమిడిపోయి, లోకం నుంచి విడిపోగలిగిన సీతకి కలలెందుకు వస్తాయి? లోకంతో సంబంధాన్ని అదే నిర్దేశించుకుంటుంది. అంతేనా? పాము పుట్టలో దాక్కుంటుంది. పక్షులు చెట్ల మీద ఉంటాయి. వాటికి అభద్రతాభావం ఎక్కువ. చిన్న సీత తనలోకి వెళ్ళిపోతుంది. అన్ని భయాలకీ, బాధలకీ, వియోగాలకీ అతీతంగా ఉండగలుగుతుంది. పారిపోదు. చివరికి నిద్ర ఆవహించ డానికి ముందు ఆమెకి ఒకటి స్ఫురించింది. చిన్న సీతకి తన గురించి తెలుసు. తనకి ఏదో చెప్పాలని నిరంతరం ప్రయత్నిస్తోంది. అది తనకోసం వచ్చింది.

తరువాత కొన్నిదినాలు ఏకాంతంగా ఉన్నప్పుడు చుట్టూ సంచారంలో ఉన్న సీతను గమనిస్తూ ఆలోచనలో పడింది ఊర్మిళ. గాలికి నదిలో సాగుతున్న ఒంటరి పడవలా ఆమెని జ్ఞాపకాలు, ఆలోచనలు వెనక్కీ ముందుకీ తిప్పుతున్నాయి. ఎప్పుడు ఏకాంతంలో ఉన్నా భయంగా ఉండేదామెకు. ఇక తను జీవితంలో సౌమిత్రిని చూడలే నేమోననే భయం హృదయం మీద శిలవలె ఉండేది. తన జీవితం భయం ఉండ చుట్టిన వియోగం. ఒక సాయంత్రం ఊర్మిళకు అక్క సీత మాటలు మొదటిసారిగా జ్ఞాపకం వచ్చేయి. 'బాల్యం తప్ప క్షత్రియ స్త్రీకి సుఖం ఉండదు.' అంటే తన సుఖ సౌఖ్యాలు తనతో నిమిత్తం లేనివని గదా. క్షత్రియుడి జీవితం బాణం వంటిది. విల్లుని విడిచి పెట్టిన తరువాత తిరిగి రాదు. అతని అర్ధాంగి అమ్ములు లేని అమ్ముల పొది! అక్క అలాగే అనుకుంటోందా? ఆ స్పృహలోనే జీవిస్తోందా ఆమె? ఆమెకి సీత నవ్వు ముఖం కనిపించింది. ఆ ముఖం చూస్తూ తేరుకుంది ఊర్మిళ.

ఊర్మిళ కాలికి ఏదో చల్లగా తగిలింది. కాలి బొటనవేలు దగ్గర చిన్న సీత తలకాయ. తలెత్తి తనవేపు చూస్తోంది. తల మళ్లీ లోపలికి తీసుకుంటూ ఊర్మిళ బొటనవేలుని మృదువుగా కొరికింది చిన్న సీత.

ఉలిక్కిపడింది ఊర్మిళ. మరికొన్ని దినాలు గడిచేయి.

ఊర్మిళ తరచుగా కాలి బొటనవేలు తడిమి చూసుకుంటున్నది. .

నడిరాత్రి అయినా ఆమెకి నిద్రరాలేదు. బయట దివ్యమైన వెన్నెల వెలుగులు. గదిలో దీపం చలిస్తోంది. ఆమె లేచి కూచుని ఒంగి బుట్టని తాకి సీతని పిలిచింది. తేలిగ్గా ఉంది బుట్ట. ఊర్మిళ లేచి బయటి ద్వారం దగ్గర నుంచుని చూసింది. పెద్ద వాతాయనం నుంచి వెన్నెల గాలి తాకుతోంది. ఆ రేయి ప్రశాంత నిశ్శబ్దాన్ని మనసు నిండా పీల్చుకుంది ఊర్మిళ. వెన్నెట్లో పడుకుని ఉంది సీత. కాసేపు సీతని చూస్తూ ఉండిపోయిందామె. హఠాత్తుగా ఆమెకి తన శరీరం బరువు కోల్పోయినట్టనిపించింది. మేలుకున్నప్పుడల్లా నిరాయుధుడైన శత్రువు మీదికి లంఘించి దాడి చేస్తున్నట్టు అనిపించే ఉద్వేగాలన్నీ ఉపశమించినట్టు తోచిందామెకి.

తల బయట పెట్టి తనవేపు చూస్తోంది సీత.

అసంకల్పితంగా ఊర్మిళ సీత ఎదురుగా కూచుంది.

అదే స్థితిలో పద్మాసనం వేసుకుని బొటన వేలిని తాకి చూసుకుందామె.

అట్లాగే కాసేపు చూసుకుంటూ ఉండిపోయి, సీత వేపు చూస్తూ అన్నదామె.

''చెప్పు సీతా, నేనిపుడు సిద్ధంగా ఉన్నాను.''

అంతసేపూ వెన్నెల తాగి మత్తెక్కినట్టు సీత తల ఎత్తి చూడలేక ఆమెనే చూస్తూ క్రమంగా తనలోకి వెళ్లిపోయింది.

ఊర్మిళ ఆ సుప్తచైతన్యాన్ని అరమోడ్పు కళ్లతో చూస్తోంది.


కాసేపటికి ఆమె కళ్లు ధ్యానస్థితిలో మూతలు పడ్డాయి.

మరికాసేపటికి సీత తల బయట పెట్టి ఆమెని చూసి లోపలికి వెళ్లిపోయింది. మరునాటి ఉదయం, ఆ మర్నాటి మర్నాడు చెలులు ఎంత వెదికినా చిన్న సీత కనిపించలేదు.

*మూల రామాయణంలో 'ఊర్మిళనిద్ర' లేదు.*
*తరువాత చేసిన మంచి కల్పన అది. ఇది మరొకటి.*

*చినుకు మాసపత్రిక*
*మార్చి 2020*

*




**తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి** 14 మే 1945న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ సీతన్న తాట 1962లో ఆంధ్రప్రభలో అచ్చయింది. అయిదు కథాసంపుటాలు- వడ్లచిలకలు, పతంజలిశాస్త్రి కథలు, నలుపెరుపు, రామేశ్వరం కాకులు, సమాంతరాలు; నాలుగు నవలలు, నాలుగు నాటకాలు, భమిడిపాటి కామేశ్వరరావుగారి సంక్షిప్త జీవితచరిత్ర, ఒక కవితా సంపుటి ప్రచురించారు. ఆర్కియాలజీ చదివి, పర్యావరణ కార్యకర్తగా స్థిరపడి ప్రస్తుతం ఎన్విరాన్ మెంట్ సెంటర్ అధ్యక్షులుగా ఉన్నారు.

***చిరునామా: 86-4-16/1, వాడ్రేవునగర్, రాజమండ్రి - 533003, తూ.గో. జిల్లా***
***ఫోన్: 94407 03440 Email: ec_india@yahoo.com***